సింహాచలం : అంతర్జాతీయ జగద్గురు పీఠం ఆధ్వర్యంలో ఈనెల 11నుంచి నగరంలోని అంకోసాలో నిర్వహించనున్న గురుపూజోత్సవానికి విచ్చేసిన విదేశీ సాధకులు సోమవారం సింహాచలం శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు.





కాలేజీలకు కొత్త రూపు 8లో

- నాడు-నేడుతో సకల హంగులు
- జిల్లాలో 8 జూనియర్ కాలేజీల అభివృద్ధి

న్యూస్‌రీల్

ఏడుగురు సీఐలకు స్థానచలనం



దొండపర్తి(విశాఖ దక్షిణ): నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏడుగురు ఇన్‌స్పెక్టర్లకు స్థానచలనం కలిగిస్తూ పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సిటీ వీఆర్‌లో ఉన్న ఎస్.రమేష్‌ను సీసీఎస్ సీఐగా నియమించగా.. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఎస్.సాయిని నార్త్ ట్రాఫిక్‌కు బదిలీ చేశారు. అలాగే సిటీ వీఆర్‌లో ఉన్న పి.శోభన్ బాబును హార్బర్ లా అండ్ ఆర్డర్‌కు, నార్త్ సబ్‌డివిజన్ ట్రాఫిక్‌లో ఉన్న టి.వి.విజయ్‌కుమార్‌ను సిటీ వీఆర్‌కు, ఆరిలోవ లా అండ్ ఆర్డర్ సీఐగా ఉన్న టి.ఇమ్మాన్యుయల్ రాజును సిటీ వీఆర్‌కు పంపించారు. ద్వారకా సబ్ డివిజన్ క్రైంలో ఉన్న బి.రమణమూర్తిని మహారాణిపేట లా అండ్ ఆర్డర్‌కు అక్కడ విధులు నిర్వర్తిస్తున్న జి.సోమశేఖర్‌ను ఆరిలోవ లా అండ్ ఆర్డర్‌కు స్థాన చలనం కలిగించారు.

నేడు కోర్టుకు ఆంధ్రజ్యోతి ఎండీ వేమూరి?

అల్లిపురం (విశాఖ దక్షిణ): పరువునష్టం కేసులో ఆంధ్రజ్యోతి సీఈవో, మేనేజింగ్ డైరెక్టర్ వేమూరి రాధాకృష్ణ మంగళవారం కోర్టుకు హాజరుకానున్నట్లు సమాచారం. ఒకటో చీఫ్ మెట్రోపాలిటిన్ మేజిస్ట్రేట్ కోర్టులో పరువునష్టం కేసుకు సంబంధించి హాజరవుతున్నట్లు తెలిసింది. 2011లో 'పత్రిక పేరుతో పాగా' అనే శీర్షికతో ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురణపై ఫిర్యాది శశాంక్ మోహన్ తొమ్మిది మందిపై క్రిమినల్ డిఫమేషన్ కేసు ఫైల్ చేశారు. అందులో వేమూరి రాధాకృష్ణతో పాటు ఆంధ్రజ్యోతి ఎడిటర్ కె.శ్రీనివాస్, ఏబీఎన్ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ కె.శివప్రసాద్‌లను కోర్టు ఎదుట మంగళవారం హాజరుకావాలని కోర్టు ఈ నెల 4వ తేదీన పేర్కొంది.

సకాలంలో పన్నులు చెల్లించి సహకరించండి

జీవీఎంసీ కమిషనర్ విజ్ఞప్తి

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): సకాలంలో పన్నులు చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు నగర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మొండి బకాయిలతోపాటు ప్రజలు విధిగా చెల్లించాల్సిన ఆస్తి, ఖాళీ జాగా పన్నులు వెంటనే చెల్లించాలన్నారు. ఈ ఆర్థిక సంవత్సరం మార్చి నెలలో ముగియనున్న నేపథ్యంలో వివిధ పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, విద్యా సంస్థలు కూడా త్వరగా పన్నులు చెల్లించాలని కోరారు. వ్యాపారస్తులు, దుకాణదారులు, ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని, లేని వారు తక్షణమే తీసుకోవాలన్నారు. క్లాప్ పథకంలో భాగంగా చెత్త నిర్వహణకు విధించే యూజర్ చార్జీలను ప్రజలు స్వచ్ఛందంగా చెల్లించాలని తెలిపారు.

నేడు వీఎంఆర్‌డీఏ షాపులకు బహిరంగ వేలం

దొండపర్తి(విశాఖ దక్షిణ): వీఎంఆర్‌డీఏ వాణిజ్య సముదాయాలు, షాపుల బహిరంగ వేలానికి సంబంధించి పెద్ద సంఖ్యలో ఆసక్తిదారుల నుంచి దరఖాస్తులు రావడంతో మంగళవారం రెండు పూటలా వేలం నిర్వహించనున్నట్లు వీఎంఆర్‌డీఏ కార్యదర్శి టి.వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో ఉదయం 11 నుంచి టీయూ-142 మ్యూజియంలో గల సావనీర్ దుకాణం, వైఎస్సార్ సెంట్రల్ పార్క్ ఎదురుగా ఉన్న దుకాణాలు, రాంనగర్ సైట్-2లో షాపులకు వేలం జరుగుతుందని పేర్కొన్నారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి రాంనగర్ సైట్-1లో గల షాపులకు వేలం ప్రక్రియను చేపడుతున్నట్లు వెల్లడించారు. ఒక దుకాణానికి ఒక దరఖాస్తు మాత్రమే దాఖలైతే ప్రభుత్వ నిబంధనల ప్రకారం వేలం నిర్వహణకు అవకాశం లేదని స్పష్టం చేశారు.

నేటి నుంచి సింహగిరిపై ధారోత్సవాలు

సింహాచలం: సింహగిరిపై గంగధార వద్ద మంగళవారం నుంచి ఈనెల 14వ తేదీ వరకు ధారోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ఈనెల 10వ నుంచి 13వ తేదీ వరకు ఆర్జిత నిత్యకల్యాణం రద్దు చేసినట్టు అధికారులు తెలిపారు.

ఉక్కు ఫైనాన్స్ డైరెక్టర్ పదవీ కాలం పొడిగింపు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ (ఫైనాన్స్) వి.వి.వేణుగోపాలరావు పదవీ కాలం పొడిగించారు. ఈ మేరకు ఉక్కు మంత్రిత్వశాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన టర్మ్ గత ఏడాది జూన్ నెలాఖరుతో ముగిసింది. అయితే ఆయన పదవీ విరమణ వయసు ఇంకా ఉండటంతో పదవీ కాలం గత ఏడాది జూలై నుంచి ఈ ఏడాది ఏప్రిల్ 30 వరకు పొడిగిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఓఎస్‌ఆర్టీసీకి సహకారం

- ఒడిశా ఆర్టీసీతో ఏపీఎస్‌ఆర్టీసీ ఒప్పందం
- ట్రాఫిక్, లాజిస్టిక్స్, బస్సుల నిర్వహణల్లో శిక్షణ
- ఈనెల 25 తర్వాత ఆ రాష్ట్రానికి ఆర్టీసీ అధికారులు





సాక్షి, విశాఖపట్నం: మెరుగైన ప్రయాణికుల రవాణా వ్యవస్థతో దేశంలోనే గుర్తింపు పొందిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్‌ఆర్టీసీ) పనితీరు పొరుగు రాష్ట్రాలను ఆకర్షిస్తోంది. మన ఆర్టీసీ మెరుగైన పనితీరు, సాధిస్తున్న ప్రగతి, బస్సుల నిర్వహణ, మానవ వనరులు, ఇక్కడున్న మౌలిక సదుపాయాలు వంటివి ఇందుకు దోహదం చేస్తోంది. వీటికి ఆకర్షితులైన ఒడిశా స్టేట్ రోడ్డు రవాణా సంస్థ (ఓఎస్‌ఆర్టీసీ) తాజాగా ఏపీఎస్ ఆర్టీసీతో అవగాహన ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. ఇందులోభాగంగా ఏపీఎస్‌ఆర్టీసీ సమర్థవంతంగా నిర్వహిస్తున్న హెచ్‌ఆర్ (మానవ వనరులు), తక్కువ మైలేజీతో బస్సులు నడపడం, తక్కువ నిర్వహణ వ్యయం తీరుతెన్నులు, ఏపీఎస్‌ఆర్టీసీ కార్యకలాపాలు, బస్సుల నిర్వహణ, పర్సనల్ మేనేజ్‌మెంట్, టీమ్ వర్కు, అకౌంట్స్, లాజిస్టిక్స్, స్టోర్స్ తదితర అంశాలపై ఓఎస్‌ఆర్టీసీ అధికారులకు మన ఆర్టీసీ అధికారులు శిక్షణ ఇస్తారు. 40 రోజులపాటు వీరికి శిక్షణ ఉంటుంది. అంతేకాదు.. ఒడిశా ఆర్టీసీ బస్సులకు విజయనగరంలో ఉన్న జోనల్ వర్క్‌షాపులో బస్సుల బాడీ బిల్డింగ్, అరిగిన బస్సు టైర్ల రీట్రేడింగ్ (రీబటన్)తో పాటు గ్యారేజీ వర్కులను కూడా చేపడతారు. ఓఎస్‌ఆర్టీసీ మునుపటికంటే తమ బస్సుల సంఖ్యను గణనీయంగా పెంచుకుంటోంది. ఫలితంగా వాటి నిర్వహణకు మౌలిక సదుపాయాల కల్పన ఆర్థికంగా భారమవుతుంది. ఇప్పటికే సమర్థవంతమైన ఈ వ్యవస్థ మన ఆర్టీసీకి ఉండడంతో ఒడిశా బస్సుల నిర్వహణ వ్యయం తగ్గుతుంది. వీటన్నిటికీ ఓఎస్‌ఆర్టీసీ.. ఏపీఎస్‌ఆర్టీసీకి కొంత మొత్తం చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకుంది. ఇది ఏపీఎస్‌ఆర్టీసీకి ఆర్థికంగా ప్రయోజనం చేకూరుతుంది. మరోవైపు పరస్పర సహకారంతో కార్గో (లాజిస్టిక్స్) రవాణా కూడా చేపట్టాలని నిర్ణయించారు. మన ఆర్టీసీ బుక్ చేసిన సరకులను ఓఎస్‌ఆర్టీసీ బస్సుల్లోనూ, వాళ్లు బుక్ చేసిన కార్గోను ఏపీఎస్‌ఆర్టీసీ బస్సుల్లోనూ రవాణా చేసేలా పరస్పర అవగాహన కుదుర్చుకున్నారు.

వర్క్ కల్చర్‌పై కూడా..

ప్రధానంగా మన ఆర్టీసీ వర్క్ కల్చర్‌ను తమ సిబ్బందికి నేర్పమని ఓఎస్‌ఆర్టీసీ యాజమాన్యం కోరింది. దీంతో జోన్-1 (ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలోని) ఆర్టీసీ ఉన్నతాధికారులు అందుకవసరమైన చర్యలు చేపట్టారు. ఓఎస్‌ఆర్టీసీ పర్సనల్ విభాగానికి చెందిన ఉన్నతాధికారి దుర్గామాధవ్ మహాపాత్ర నేతృత్వంలోని 17 మంది సీనియర్ అధికారులు సోమవారం వచ్చారు. వీరికి విజయనగరంలోని జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కాలేజీలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రవికుమార్, ఎస్‌టీసీ ప్రిన్సిపాల్ సుధాబిందు సారథ్యంలో 40 రోజుల పాటు వివిధ అంశాలపై శిక్షణ ఇస్తారు. అదే సమయంలో డిపోలు, వర్క్‌షాపుల్లో ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇస్తూ అన్ని యూనిట్లను చూపిస్తారు.

త్వరలో ఒడిశాకు వెళ్తాం..



ఏపీఎస్‌ఆర్టీసీ పనితీరుకు ఓఎస్‌ఆర్టీసీ ఆకర్షితులైంది. మన ఆర్టీసీకున్న వనరులను వినియోగించుకోవడంతో పాటు ఒడిశా ఆర్టీసీ అధికారులకు వివిధ అంశాలపై శిక్షణ కూడా ఇచ్చేలా ఒప్పందం కుదిరింది. తాజాగా వారికి విజయనగరం జోనల్ స్టాఫ్ కాలేజీలో శిక్షణ కూడా ప్రారంభమైంది. మూడు నెలల్లో మరో బ్యాచ్‌కు శిక్షణకు ఇస్తాం. ఈనెల 25 తర్వాత ఆర్టీసీ చీఫ్ మేనేజర్, వర్క్స్ మేనేజర్‌తో కలిసి ఒడిశాకు వెళ్తాం. ఏపీఎస్‌ఆర్టీసీ నుంచి పొందే సేవలకు చెల్లింపులు, పరస్పరం కార్గో రవాణా సంబంధించిన అంశాలపై ఓఎస్‌ఆర్టీసీ అధికారులతో చర్చిస్తాం.

– చింతా రవికుమార్, జోన్-1, ఈడీ

వైజాగ్ టు హైదరాబాద్

- మరో రెండు ఎయిర్ ఏసియా ఫ్లైట్లు
- ఫిబ్రవరి 13 నుంచి ప్రారంభం



సాక్షి, విశాఖపట్నం: విశాఖపట్నం-హైదరాబాద్‌ల మధ్య మరో రెండు విమాన సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. ఎయిర్ ఏసియా సంస్థ వీటిని రోజుకు రెండు సర్వీసులు చొప్పున నడపనుంది. ఫిబ్రవరి 13 నుంచి ఒకటి, మార్చి మూడో తేదీ నుంచి మరొక విమాన సర్వీసును ప్రారంభించనుంది. ఫిబ్రవరి 13న ప్రారంభమయ్యే మొదటి విమానం ఉదయం 7.55 గంటలకు హైదరాబాద్‌లో బయల్దేరి 8.40 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. తిరిగి ఈ విమానం 9.15 గంటలకు బయల్దేరి 10.30 గంటలకు చేరుతుంది. అలాగే మార్చి 3వ తేదీ నుంచి నడిచే మరో విమానం విశాఖలో సాయంత్రం 3.40 గంటలకు బయల్దేరి సాయంత్రం 4.40 గంటలకు హైదరాబాద్ వెళ్తుంది. అదే విమానం సాయంత్రం 5.15 గంటలకు హైదరాబాద్‌లో బయల్దేరి 6.10 గంటలకు విశాఖ వస్తుంది.

విశాఖ-సికింద్రాబాద్ మధ్య సంక్రాంతి స్పెషల్స్



తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): సంక్రాంతి పండగ సందర్భంగా ప్రయాణికుల రద్దీని తగ్గించేందుకు విశాఖపట్నం-సికింద్రాబాద్ మధ్య పలు స్పెషల్ రైళ్లను నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం ఎ.కె.త్రిపాఠి తెలిపారు. విశాఖపట్నం-సికింద్రాబాద్ (08505) సంక్రాంతి స్పెషల్ విశాఖలో ఈనెల 11,13,16 తేదీల్లో రాత్రి 7.50 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7.10 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్‌లో ఈనెల 12,14,17 తేదీల్లో రాత్రి 7.40 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 8.20 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది. ఈ స్పెషల్ రైళ్లు ఇరుమార్గాల్లో దువ్వాడ, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, ఏలూరు, రాయనపాడు, ఖమ్మం, వరంగల్, కాజీపేట, జనగాం స్టేషన్‌లలో ఆగుతాయి. ఈ రైళ్లు 4-సెకండ్ ఏసీ, 12-థర్డ్ ఏసీ, 1-సెకండ్ క్లాస్ కమ్ లగేజీ కమ్ దివ్యాంగులు, 1-జనరేటర్ మోటార్ కార్ కోచ్‌లతో ప్రయాణిస్తాయి.

విశాఖ వరకు వందేభారత్?

తాటిచెట్లపాలెం (విశాఖ ఉత్తర): సికింద్రాబాద్-విజయవాడ మధ్య ఈ నెల 19వ తేదీన వందేభారత్ రైలు ప్రారంభించనున్నారు. దక్షిణ మధ్య రైల్వేకు చెందిన ఈ వందేభారత్ రైలును విశాఖ వరకూ పొడిగించే అవకాశాలు ఉన్నట్లు అధికారిక వర్గాల ద్వారా తెలిసింది. అయితే ఈస్ట్‌కోస్ట్ రైల్వేకు సంబంధించిన వందేభారత్ వివరాలు ఇప్పటివరకు తెలియలేదు. ఈస్ట్ కోస్ట్ రైల్వే పరిధిలో త్వరలోనే విశాఖ నుంచి విజయవాడ లేదా తిరుపతి, సికింద్రాబాద్‌లకు వందేభారత్ రైలును ప్రారంభిస్తామని గత డిసెంబరులో స్వయంగా వాల్తేర్ డివిజన్ డీఆర్ఎం అనూప్‌కుమార్ సత్పతి తెలిపారు. అయితే దీని గురించి అధికారిక సమాచారం ఇప్పటివరకు తెలియలేదు. కానీ సికింద్రాబాద్ నుంచి మాత్రం 19వ తేదీన వందేభారత్ రైలు ప్రారంభం కానుంది. ఇది విజయవాడ వరకు నడుపుతారా? లేదా విశాఖ వరకు నడుపుతారా? అన్నది స్పష్టత లేదు.

సంతృప్తి స్థాయిలో వైద్య సేవలు

- దేశంలోనే వినూత్నం 'ఫ్యామిలీ ఫిజీషియన్'
- ఆస్పత్రుల్లో ఖాళీలన్నీ భర్తీ
- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- ఉత్తరాంధ్ర వైద్యశాఖ అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజని, వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కృష్ణబాబు, రాష్ట్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ జె.నివాస్, జిల్లా కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట (విశాఖ దక్షిణ): వైద్య ఆరోగ్య రంగాన్ని మరింత పటిష్టం చేస్తున్నామని, ముఖ్యమంత్రి మరో అడుగు ముందుకేసి దేశం గర్వించదగ్గ బృహత్తర కార్యక్రమం 'ఫ్యామిలీ ఫిజీషియన్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజిని పేర్కొన్నారు. సోమవారం వీఎంఆర్డీఏ ఎరీనాలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎం.టి.కృష్ణబాబుతో కలిసి ఉత్తరాంధ్ర వైద్యశాఖ అధికారులతో ప్రాంతీయ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఫ్యామిలీ ఫిజీషియన్, విలేజ్ హెల్త్ క్లినిక్స్, అర్బన్ హెల్త్ క్లినిక్స్, వెక్టర్ కంట్రోల్ హైజీన్ మెజర్స్, ఎపిడమిక్ డిసీజ్ సర్వేలపై సమీక్ష చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు స్థానికంగానే వైద్య పరీక్షలు, మెరుగైన వైద్యం అందించాలన్నదే ఫ్యామిలీ ఫిజీషియన్ ఉద్దేశమని చెప్పారు. వైద్య శాఖలో పూర్తిస్థాయి సిబ్బంది నియామకాలకు సీఎం జగన్ ఆదేశాలు జారీ చేశారన్నారు. మూడేన్నరేళ్లలో 47 వేల పోస్టులను భర్తీ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా రాష్ట్రంలో ఎక్కడా మందుల కొరత లేదని వెల్లడించారు. ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా రాష్ట్ర ప్రజలకు వైద్య సేవలు విస్తృతంగా, సంతృప్తి స్థాయిలో అందుతున్నాయన్నారు. కేజీహెచ్ అభివృద్ధిలో కలెక్టర్ మల్లికార్జున చూపిన చొరవకు అభినందనలు తెలిపారు. ఒక్కో వార్డు అభివృద్ధి, మౌలిక సదుపాయాల కోసం కలెక్టర్ ప్రత్యేకంగా నిధులు ఇచ్చారని అన్నారు.

వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎం.టి.కృష్ణబాబు మాట్లాడుతూ నిరుపేదల కోసం సీఎం జగన్ మోహన్‌రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారన్నారు. ఇప్పటికే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ద్వారా నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం ఉచితంగా అందిస్తున్నారన్నారు. విద్య, వైద్య రంగంలో ఏపీని మొదటి స్థానంలో నిలపడం ముఖ్యమంత్రి లక్ష్యమని పేర్కొన్నారు. కేజీహెచ్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిన విశాఖ కలెక్టర్ మల్లికార్జునను అభినందించారు. జిల్లా కలెక్టర్ డా.ఎ.మల్లికార్జున మాట్లాడుతూ కేజీహెచ్, ఇతర ఆస్పత్రులలో మెరుగైన వైద్య సేవలు అందించడానికి గాను పలు కార్యక్రమాలను చేపట్టామని వివరించారు. రూ.3.3 కోట్ల సీఎస్ఆర్ నిధులను వెచ్చించి వివిధ పనులను నిర్వహించామన్నారు. పట్టణ ఆరోగ్య కేంద్రాలలో సిబ్బందిని భర్తీ చేయాలన్నారు. రూ.40 లక్షల సీఎస్ఆర్ నిధులతో పాడేరు ఏరియా ఆస్పత్రిని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తెచ్చినట్లు తెలిపారు. తద్వారా ఏజెన్సీలో గతంలో ఎన్నడూ లేని విధంగా 600 సర్జరీలు పూర్తి చేసినట్లు తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ కమిషనర్ జె.నివాస్ మాట్లాడుతూ గ్రామ, వార్డు స్థాయిలో ప్రజలకు వైద్య సేవలు అందించే క్రమంలో ఎటువంటి సమస్యలు ఉన్నా తెలియజేయాలన్నారు. డీఎంహెచ్‌వో, డీసీహెచ్ఎస్‌లు సంయుక్తంగా కలిసి పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎంఐడీసీ ఎండీ మురళీధర్ రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి జీఎస్ నవీన్‌కుమార్, ఆరోగ్యశ్రీ ముఖ్య నిర్వహణ అధికారి హరీంద్ర ప్రసాద్, ఏపీడీఎమ్‌ఈ డాక్టర్ వినోద్ కుమార్, విశాఖ జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు, ఆరు జిల్లాల నుంచి వచ్చిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, డీసీహెచ్ఎస్‌లు పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 40 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఏడీసీపీ (అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు

దొండపర్తి (విశాఖ దక్షిణ): స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని నగర పోలీస్ కమిషనర్ సీహెచ్.శ్రీకాంత్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 40 ఫిర్యాదులు వచ్చాయి. ఏడీసీపీ (అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు ఫిర్యాదులు స్వీకరించగా.. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీపీ ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా డీసీపీ, ఏడీసీపీలు, ఏసీపీలతో పాటు అన్ని పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

హామీల అమల్లో జగన్ రికార్డు

- అప్పుడు విన్నారు... ఇప్పుడు అమలు చేశారు
- సంకల్పయాత్రకు నాలుగేళ్లు పూర్తి
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు ఆధ్వర్యంలో సంబరాలు



కేక్ కట్ చేస్తున్న పార్టీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల, ఎమ్మెల్సీలు వంశీకృష్ణ, వరుదు కల్యాణి, ఎమ్మెల్యే వాసుపల్లి, నెడ్‌క్యాప్ చైర్మన్ కె.కె రాజు, వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని, మాజీ మంత్రి బాలరాజు

సాక్షి, విశాఖపట్నం: ప్రజాసంకల్పయాత్రలో ప్రజల సమస్యలు విన్నారు....అధికారం చేపట్టిన మూడున్నరేళ్లలోనే ఇచ్చిన హామీలను అమలు చేసి దేశ చరిత్రలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రికార్డు సృష్టించారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేష్‌బాబు కొనియాడారు. తండ్రిని మించిన తనయుడిగా అన్ని వర్గాల వారికీ సంక్షేమ పథకాలు అందిస్తూ సంక్షేమ రాజ్యాన్ని తీసుకొచ్చారన్నారు. ప్రజాసంకల్పయాత్రకు నాలుగేళ్ల పూర్తయిన సందర్భంగా సోమవారం మద్దిలపాలెం పార్టీ జిల్లా కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పంచకర్ల రమేష్‌బాబు మాట్లాడుతూ.. ప్రజాసంకల్పయాత్రలో ప్రజల సమస్యలన్నింటినీ డైరీలో రాసుకుని.. వాటిని నవరత్నాలు పేరిట అమలు చేశారన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందించే సేవలను దేశ ప్రధాని ప్రశంసించిన సందర్భాలు చూశామన్నారు. మరో 30 ఏళ్ల పాటు ఏపీకి సీఎంగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఉండాలని, అప్పుడే అన్ని రంగాల్లో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందన్నారు. ఎమ్మెల్సీలు వంశీకృష్ణ శ్రీనివాస్, వరుదు కల్యాణి మాట్లాడుతూ జగనన్నే మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నా రన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేయడం ఖాయమన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ తాను రాజకీయంగా ఆ గడప చూశాను...ఈ గడప చూశాను. కానీ ప్రజల హృదయాల్లో సీఎం జగన్ మోహన్‌రెడ్డికి స్థానం ఏంటో ప్రత్యక్షంగా చూశానని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ క్లీన్ స్వీప్ చేయడం ఖాయమని, జగనే మళ్లీ సీఎం అవుతారన్నారు. ఉత్తర, తూర్పు సమన్వయకర్తలు కేకే రాజు, అక్కరమాని విజయనిర్మల మాట్లాడుతూ..గత టీడీపీ పాలనతో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజా సంకల్పయాత్రలో తెలుసుకుని అధికారం చేపట్టిన మూడున్నరేళ్లలోనే సీఎం వై.ఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిష్కరించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి బాలరాజు, నియోజకవర్గాల పరిశీలకులు చింతలపూడి వెంకట్రామయ్య, ఎస్.ఎ రెహ్మాన్, మాజీ ఎమ్మెల్యే అల్లు భానుమతి, కార్పొరేషన్ చైర్మన్లు జాన్ వెస్లీ, చొక్కాకుల లక్ష్మీ వెంకట్రావ్, పల్లా చినతల్లి, మంతెన మాధవి వర్మ, డిప్యూటీ మేయర్లు జియ్యాని శ్రీధర్, కె.సతీష్, పిల్లా సుజాత, పిల్లి సుజాత, డిప్యూటీ ఫ్లోర్‌లీడర్ అల్లు శంకర్‌రావు, పార్టీ కార్యాలయ ఇన్‌చార్జి రవిరెడ్డి, కార్పొరేటర్లు రెయ్యి వెంకటరమణ, పీవీ సురేష్, మొల్లి లక్ష్మి, బిపిన్‌కుమార్ జైన్, కె.వి.ఎన్ శశికళ, ఎ.శ్రీవిద్య, గేదెల లావణ్య, ఎస్.లక్ష్మి, ముఖ్యనాయకులు ఐహెచ్ పరూఖీ, మొల్లి అప్పారావు, బెహరా భాస్కరరావు, సతీష్‌వర్మ, అల్లంపల్లి రాజుబాబు, ఎండీ షరీఫ్, కృష్ణంరాజు, పేర్ల విజయచందర్, బి.బంగారయ్య, మంత్రి రాజశేఖర్, రాధ, నీలిరవి, యువశ్రీ, పీలా వెంకటలక్ష్మి, గరికిన గౌరి, బోని శివరామకృష్ణ, కృపాజ్యోతి, సత్యాల సాగరిక నీలి రవి, కార్పొరేషన్ డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు. అలాగే జిల్లాలో గల అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, సమన్వయకర్తల ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు.

30 ఏళ్లు జగనే సీఎం



జీవీఎంసీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న మేయర్

దాబాగార్డెన్స్ : ప్రజా సంకల్పయాత్ర నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్ గొలగాని హరివెంకట కుమారి కేక్ కట్ చేశారు. సంకల్పయాత్రలో సమస్యలు తెలుసుకుని నవరత్నాలను అమలు చేశారన్నారు. మరో 30 ఏళ్లు జగనన్నే ముఖ్యమంత్రిగా కొనసాగుతారని పేర్కొన్నారు.

డయల్ యువర్ మేయర్‌కు 17, స్పందనకు 65



స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్న మేయర్, కమిషనర్

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): జీవీఎంసీ ప్రధాన కార్యాలయ మేయర్ చాంబర్లో సోమవారం ఉదయం 10 నుంచి 11 గంటల వరకు నిర్వహించిన డయల్ యువర్ మేయర్ కార్యక్రమానికి 17 ఫిర్యాదులు వచ్చాయి. నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, కమిషనర్ పి.రాజాబాబు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రధాన ఇంజినీరింగ్ విభాగానికి 8, పట్టణ ప్రణాళికా విభాగానికి 4, ప్రజారోగ్యానికి 2, డీసీ (రెవెన్యూ)కి 2, యూసీడీకి 1 ఫిర్యాదును ఫోన్ ద్వారా స్వీకరించారు.

స్పందనకు 65 వినతులు

జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో మేయర్ హరివెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ పి.రాజాబాబు సంయుక్తంగా నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 65 వినతులు వచ్చాయి. వీటిలో జోన్-1 నుంచి ఒకటి, జోన్-2 నుంచి తొమ్మిది, జోన్-3 నుంచి ఐదు, జోన్-4 నుంచి ఎనిమిది, జోన్-5 నుంచి ఐదు, జోన్-6 నుంచి 19, జోన్-8 నుంచి 11, ప్రధాన కార్యాలయానికి ఏడు ఫిర్యాదులు వచ్చాయి. వీటిలో పరిపాలనా, అకౌంట్స్ విభాగానికి 3, రెవెన్యూకి 4, టౌన్‌ప్లానింగ్‌కు 25, ఇంజనీరింగ్/హార్టీకల్చర్‌కు 21, యూసీడీకి 12 వినతులు వచ్చాయి. వాటిని పరిశీలించి వచ్చిన ఫిర్యాదులను 3 రోజుల్లో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని మేయర్, కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్లు వై శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

కాలపరిమితిలోగా అర్జీలు పరిష్కరించాలి

కలెక్టర్ మల్లికార్జున



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట (విశాఖ దక్షిణ): స్పందనలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించాలని కలెక్టర్ మల్లికార్జున అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన దరఖాస్తుల పరిష్కారంపై అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా మల్లికార్జున మాట్లాడుతూ పిటీషనర్లకు సమాధానం ఇచ్చే ముందు ఉన్నతాధికారులు క్షుణ్ణంగా పరిశీలించి మళ్లీ తిరిగి రాకుండా జాగ్రత్త వహించాలన్నారు. రీఓపెన్ పిటీషన్లు మళ్లీ రాకుండా చూడాలన్నారు. జాయింట్ కలెక్టర్ కేఎస్ విశ్వనాథన్ ప్రతికూల ప్రెస్ క్లిప్పింగులకు సంబంధించి ఖండనలను వెంటనే పంపాలని ఆదేశించారు. ప్రతి ప్రభుత్వ శాఖలో కారుణ్య నియామక భర్తీ వివరాలను డీఆర్వోకు వెంటనే అందజేయాలన్నారు. సోమవారం నాటి స్పందనలో 205 విజ్ఞప్తులు అందాయి.

సరస్‌కు స్పందన : అఖిల భారత సరస్-2022 డ్వాక్రా బజార్ కు జిల్లా నలుమూలల నుంచి వచ్చి ప్రజలు విశేష స్పందన అందించారని డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభా రాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 27 డిసెంబర్ 2022 నుండి 8 జనవరి 2023 వరకు అఖిల భారత సరస్-2022 డ్వాక్రా బజార్‌ను ఏయూ ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో నిర్వహించామన్నారు. 218కు పైగా స్టాల్స్‌లో విక్రయాలు జరగగా మొత్తం రూ.5,15,88,000 అమ్మకాలు జరిగాయన్నారు. అనంతరం అఖిల భారత సరస్-2022 విజయవంతంగా పూర్తి చేసుకున్నందుకు జేసీ విశ్వనాథన్‌కు డీఆర్డీఏ ఉద్యోగులు సత్కరించారు. జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, మున్సిపల్ అధికారులు, పోలీస్ అధికారులు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మహిళకు అసభ్యకర మెసేజ్‌లు పంపిన వ్యక్తి అరెస్ట్



దొండపర్తి(విశాఖ దక్షిణ): ఇంటర్నెట్‌లో టెక్స్‌నౌ, సెకెండ్‌లైన్ యాప్స్ ద్వారా ఫేక్ నెంబర్స్ క్రియేట్ చేసి.. వాటితో వాట్సాప్‌లో అకౌంట్ ఓపెన్ చేసి మహిళకు అసభ్యకర మెసేజ్‌లు పంపిన వ్యక్తిని సోమవారం సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరానికి చెందిన మహిళ వాట్సాప్‌కు గుర్తు తెలియని వ్యక్తి అసభ్యకరమైన మెసేజ్‌లు పంపిస్తూ వేధింపులకు గురి చేసేవాడు. దీంతో సదరు మహిళ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన సైబర్ క్రైం సీఐ భవానిప్రసాద్ సాంకేతిక సహాయంతో నిందితుడు పార్వతీపురంలో ఉన్నట్లు గుర్తించారు. నిందితుడు ఎల్ల సంతోష్‌కుమార్(28)ను పార్వతీపురంలో అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించారు.

ఈ జంట.. పరుగులో పతకాల పంట



పతకాలు సాధించిన భార్య, భర్తలు లావణ్య, నాగేశ్వరరావు

భీమునిపట్నం: గుంటూరులో మూడు రోజుల క్రితం జరిగిన ఏపీ మాస్టర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్–2023 పోటీల్లో భీమిలికి చెందిన దంపతులు కందుకూరి లావణ్య, నాగేశ్వరరావు బంగారు పతకాలను సాధించారు. లావణ్య 55 ఏళ్ల పైబడ్డ కేటగిరిలో 800 మీటర్ల పరుగు పందెం, 400 మీటర్ల రిలే, 100మీటర్ల హర్డిల్స్ పోటీల్లో ప్రథమ స్థానం పొంది బంగారు పతకాలను సాధించారు. అలాగే ఆమె భర్త నాగేశ్వరరావు 65 ఏళ్ల పైబడ్డ కేటగిరీలో 100మీటర్ల హర్డిల్స్ పోటీల్లో ప్రథమ స్థానం పొంది బంగారు పతకాన్ని గెలుచుకున్నారు. వీరు ఫిబ్రవరి 16 నుంచి హర్యానా రాష్ట్రంలోని కురుక్షేత్రలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు.



కాలేజీలకు కొత్త రూపు

- నాడు–నేడుతో సకల హంగులు
- జిల్లాలో 8 జూనియర్ కాలేజీల అభివృద్ధి
- రూ.7.98 కోట్లతో మౌలిక వసతుల పెంపు
- ఇప్పటికే రివాల్వింగ్ ఫండ్ కింద రూ.1.60 కోట్లు విడుదల
- విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా పనులు
- తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం



గదుల్లో వేసేందుకు సిద్ధం చేసిన నాపరాయి



పెందుర్తి ప్రభుత్వ జూనియర్ కాలేజీ

విశాఖ విద్య : విద్యారంగానికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోంది. 'మన బడి నాడు–నేడు' కార్యక్రమంతో పాఠశాలల రూపురేఖలు మార్చేసింది. దీనికి కొనసాగింపుగా నాడు–నేడు రెండో దశలో జూనియర్ కాలేజీల అభివృద్ధిపై దృష్టి సారించింది. విశాఖపట్నం జిల్లాలో పది ప్రభుత్వ జూనియర్ కాలేజీలు ఉండగా, వీటిలో 8 కాలేజీలను ఎంపిక చేసి, పనులు చేపట్టేందుకు రూ.7,98,31,845లు మంజూరు చేసింది. విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పించటమే లక్ష్యంగా పనులు శరవేగంగా చేస్తున్నారు. విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో ఉన్న వాటికి, అదే విధంగా బాలికల కళాశాలలకు తొలుత ప్రాధాన్యత ఇచ్చారు. దశల వారీగా జిల్లాలోని ప్రభుత్వ యాజమాన్యాల పరిధిలో గల అన్ని కాలేజీలను అభివృద్ధి చేసేలా ఇంటర్మీడియెట్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి ఆర్.సత్యనారాయణ తగిన ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు.

అభివృద్ధి కమిటీలకే అందలం

విద్యారంగాన్ని నిర్వీర్యం చేసిన టీడీపీ ప్రభుత్వం, నాడు అడపా దడపా చేపట్టిన అభివద్ధి పనులను సైతం ఆ పార్టీకి చెందిన నాయకులే అప్పగించటంతో, నిధులన్నీ వారి జేబుల్లోకి వెళ్లేవి. కానీ పారదర్శకతకు పెద్ద పీట వేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు–నేడు కింద కాలేజీల్లో చేపట్టే పనులను విద్యార్థుల 'తల్లిదండ్రుల అభివద్ధి కమిటీ 'లకే కేటాయిస్తుంది. కమిటీ సభ్యులకు ఆర్థిక భారం లేకుండా, పనులు చేసేందుకు అవసరమైన నిధులు సైతం ముందుగానే ప్రభుత్వం విడుదల చేస్తోంది. ఇలా జిల్లాలోని 8 కాలేజీలకు రివాల్వింగ్ ఫండ్ కింద రెండు దపాలకు రూ.1.60 కోట్లు ఇప్పటికే కాలేజీల వారీగా తల్లిదండ్రుల అభివృద్ధి కమిటీల బ్యాంకు ఖాతాల్లో జమ చేసింది.

కాలేజీల వారీగా మంజూరైన నిధులు ఇలా

భీమునిపట్నం: రూ. 1,26,56,188
పెందుర్తి : రూ.1,79,50,399
విశాఖపట్నం(బాలికలు) రూ.1,42,26,555
డాక్టర్ వీఎస్ కృష్ణా బాలుర కాలేజీ: రూ. 1,23,90,339
విశాఖపట్నం (ఒకేషనల్) : రూ. 62,55,984
ఇస్లాంపేట : రూ. 53,65,192
మధురవాడ: రూ. 48,45,589
ఆగనంపూడి : రూ.61,41,599
మొత్తం : రూ.7,98,31,845



పెందుర్తి కాలేజీ భవనాలకు మరమ్మత్తులు

చేపట్టే పనులు ఇవే..

- నిరంతరం నీటి వసతితో మరుగుదొడ్లు
- విద్యుత్ సౌకర్యం(ప్రతి తరగతి గదికి ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు)
- రక్షిత తాగునీటి సరఫరా
- విద్యార్థులకు, అధ్యాపకులకు ఫర్నీచర్(కుర్చీలు, బల్లలు)
- కాలేజీ సముదాయానికి పూర్తిగా రంగులు వేయడం
- కళాశాలకు అవసరమైన మరమ్మతులు చేయుట
- ఆకుపచ్చ సుద్దబోర్డు(గ్రీన్ చాక్‌బోర్డు) ఏర్పాటు
- అదనపు తరగతి గదులు, ఇంగ్లిష్ ల్యాబ్
- ప్రహరీ, కిచెన్ షెడ్డు నిర్మాణం

సకాలంలో పనులు పూర్తి చేస్తాం



జూనియర్ కాలేజీల అభివృద్ధి అనేది ఇంటర్మీడియెట్ చరిత్రలో ఇదే తొలిసారి. విద్యారంగానికి ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధకు ఇదే నిదర్శనంగా చెప్పవచ్చు. పనులను సకాలంలో పూర్తి చేసేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించేలా పర్యవేక్షణ చేస్తున్నాం. రానున్న రోజుల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు కొత్త రూపు సంతరించుకోనున్నాయి.

– ఆర్ సత్యనారాయణ, ఆర్ఐవో, విశాఖపట్నం జిల్లా

సమస్యలన్నీ తీరుతాయి



ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో నిష్ణాతులైన అధ్యాపకులు ఉన్నారు. విద్యార్థుల నుంచి మంచి క్రేజ్ ఉంది. కాలేజీల్లో అన్ని రకాల మౌలిక సౌకర్యాలు కల్పించేందుకు శ్రద్ధ చూపుతుండటం ఎంతో సంతోషించదగ్గ విషయం. పనులు పూర్తయితే సమస్యలన్నీ తీరుతాయి. మంచి ఫలితాలు సాధిస్తాం.

– కె.రాధాకృష్ణ, అధ్యాపకుడు, పెందుర్తి, జూనియర్ కాలేజీ

కలెక్టరేట్ వద్ద కార్మికుల నిరసన



కార్మికులను అరెస్టు చేస్తున్న పోలీసులు

మహారాణిపేట(విశాఖ దక్షిణ): పలు సమస్యల సాధన కోసం సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్రదర్శన చేస్తున్న సీపీఎం కార్యకర్తలు, కార్మికులను పోలీసులు అరెస్టు చేశారు. తొలుత జీవీఎంసీ గాంధీ విగ్రహం నుంచి కలెక్టరేట్ వరకు జీవీఎంసీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ప్రదర్శనగా వచ్చిన కార్మికులు కలెక్టర్ కార్యాలయం లోపలికి వెళ్లడానికి ప్రయత్నించారు. ఈ సందర్భంగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. పోలీసులు, సీపీఎం కార్యకర్తల మధ్య స్వల్ప వాగ్వాదం జరిగింది. దీంతో పోలీసులు 249 మందిని అరెస్టు చేసి బ్యారెక్స్‌లో ఉన్న కల్యాణ మండపానికి తరలించారు. ఖాళీ పోస్టుల్లో కార్మికుల వారసులను నియమించాలని, ఇతర సమస్యలపై ఆందోళన నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు పలు సమస్యలతో వినతిని సమర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి, యూనియన్ ప్రధాన కార్యదర్శి యు.రాజు, సీఐటీయూ ప్రధాన కార్యదర్శి ఆర్‌కేఎస్‌వీ కుమార్ పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

మంత్రి అమర్‌నాథ్



పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి అమర్‌నాథ్

విశాఖ స్పోర్ట్స్: జర్నలిస్టులందరికి ఇళ్ల స్థలాలు కేటాయించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని రాష్ట్ర భారీ పరిశ్రమలు, ఐటీ శాఖల మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తెలిపారు. పోర్ట్ స్టేడియంలో జరుగుతున్న జర్నలిస్టుల స్పోర్ట్స్ మీట్‌లో భాగంగా సోమవారం జరిగిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను ఇప్పటికే పూర్తిగా అమలు చేశామన్నారు. 2005లో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల విషయమై అధికారులతో మాట్లాడి న్యాయసలహాకు ఫైల్ పంపించినట్లు తెలిపారు. వీజేఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం జరిగిన క్రికెట్ రెండో సెమీఫైనల్స్‌లో ఆంధ్రప్రభ జట్టుపై ఆంధ్రజ్యోతి జట్టు విజయం సాధించింది.

2024లో కాంగ్రెస్ పార్టీదే అధికారం



మాట్లాడుతున్న చింతా మోహన్

దాబాగార్డెన్స్(విశాఖ దక్షిణ): 2024 ఎన్నికల్లో కేంద్రంలో బీజేపీ కొట్టుకుపోవడం ఖాయమని, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి 100 ఎమ్మెల్యే స్థానాలు రానున్నాయని కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు చింతా మోహన్ ఆశాభావం వ్యక్తం చేశారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికి పతనం ప్రారంభమైందని, 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి తీరుతుందన్నారు. అందుకు తాము చేసినది ఏమీ లేదని, బీజేపీపై వస్తున్న ప్రజావ్యతిరేకతే తమను అధికారంలోకి తీసుకురానుందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను ఎప్పుడో అమ్మేసిందని, ఎన్ని ధర్నాలు చేసినా ఉపయోగం లేదన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు మోక్షం కలగాలంటే కేంద్రంలో బీజేపీ ఓడిపోవాలని చెప్పారు. 14 ఏళ్లుగా ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఆంధ్ర రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. తన చెల్లి, తమ్ముడికి ఏం చేయలేకపోయారని తెలిపారు. ఉత్తరాంధ్ర నాయకుల్లో బలహీనత కరువైందని, తెన్నేటి విశ్వనాథం, గౌతు లచ్చన్న వంటి నాయకుల్లా తయారవ్వాలన్నారు. వైఎస్సార్ సీపీ వల్ల రాష్ట్రంలో చీకటి రోజులు దాపురించాయన్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ గెలిచిందంటే అది వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వల్ల కాదని, టీడీపీపై ప్రజల్లో వచ్చిన వ్యతిరేకత వల్లే అన్నారు. సమావేశంలో నగర కాంగ్రెస్ అధ్యక్షుడు గొంప గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

సాహితీ వికాసమే రాచకొండ జీవితం

ఏవీఎన్‌లో రాచకొండ సాహితీ సంస్థ వేడుకలు



రాచకొండ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

దాబాగార్డెన్స్ (విశాఖ దక్షిణ): తెలుగు భాషాభివృద్ధికి, సాహితీరంగ వికాసానికి రాచకొండ విశ్వనాథ శాస్త్రి చేసిన కృషి అమోఘమని ఎన్‌ఆర్‌ఐ మెడికల్ కళాశాల ఫిజియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ ఆర్ పార్వతి తెలిపారు. ఏవీఎన్ కళాశాల తెలుగుశాఖ ఆధ్వర్యంలో రాచకొండ సాహితీ సంస్థ ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాచకొండ కుమార్తెగా తాను గర్వపడుతున్నానని, విద్యార్థుల్లో సాహితీ పిపాస పెంపొందించేందుకు ఏవీఎన్ కళాశాల చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. ఏవీఎన్ కళాశాల పూర్వ విద్యార్థి, సంస్థ వ్యవస్థాపకుడు రాచకొండ నరసింహ శర్మ మాట్లాడుతూ భాషా వికాసానికి, సాహితీ రంగ అభివృద్ధికి విద్యార్థులు కృషి చేయాలన్నారు. ఏయూ ప్రొఫెసర్, తెలుగు శాఖ బోర్డు ఆఫ్ స్టడీస్ ఛైర్‌పర్సన్ డాక్టర్ అయ్యగారి సీతారత్నం మాట్లాడుతూ ఏవీఎన్ కళాశాలలో తెలుగు భాషాభివృద్ధికి వందేళ్లుగా పనిచేస్తున్న లైబ్రరీ ఉందని, ఇది సాహితీ చిత్రను ఇనుమడింప చేసేలా ఉందన్నారు. విద్యార్థులు ప్రతిభావంతులుగా పెరగాలంటే మరింత క్రమశిక్షణ అవసరమన్నారు. తెలుగు భాష పురోభివృద్ధికి రావిశాస్త్రి చేసిన సేవను కొనియాడారు. కళాశాల డీన్ జి శంకరనారాయణ మాట్లాడుతూ వందేళ్లుగా తెలుగు భాషాభివృద్ధికి తమ సంస్థ పనిచేస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మొజ్జాడ సింహాద్రినాయుడు మాట్లాడుతూ ప్రపంచంలో గొప్ప భాషల్లో తెలుగు ఒకటని, రెండు తెలుగు రాష్ట్రాలకే పరిమితమైన భాష తెలుగు కాదన్నారు. రాచకొండ పుస్తకాన్ని ప్రముఖులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ కిలారి గౌరీనాయుడు, రాచకొండ నరసింహవర్మ, కళాశాల ప్రొఫెసర్లు, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతిని పొదుపుగా వాడితేనే భవిష్యత్‌కు బాట

- ఆర్గానిక్ మేళా 2023 సదస్సులో శాస్త్రవేత్త డాక్టర్ ఖాదర్ వలి
- చివరి రోజు వినియోగదారుల నుంచి భారీ స్పందన
- కిటకిటలాడిన సేంద్రియ ఉత్పత్తులు, తినుబండారాల స్టాళ్లు



మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్ వలి



నేచురల్ జాగిరీ సంస్థ ప్రదర్శించిన బెల్లం ఉత్పత్తులు

ఎంవీపీకాలనీ (విశాఖ తూర్పు): ప్రకృతిని ప్రస్తుత తరం పొదుగా వాడితేనే భవిష్యత్ తరాల మనుగడ సాధ్యమవుతుందని చిరుధాన్యాల శాస్త్రవేత్త, కృషి రత్న అవార్డు గ్రహీత డాక్టర్ ఖాదర్ వలి పేర్కొన్నారు. విశాఖ ఆర్గానిక్ మేళాలో భాగంగా సోమవారం నిర్వహించిన ఆరోగ్యమే మహాభాగ్యం సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖాదర్ వలి మాట్లాడుతూ సంపూర్ణ ఆరోగ్యంతో కూడిన ఆహార భద్రత నేడు అతిపెద్ద సమస్యగా మారిందన్నారు. వ్యవసాయంలో వాడుతున్న రసాయనాలు కారణంగా భూసారం పెద్ద ఎత్తున తగ్గుతోందన్నారు. ఇదిలాగే కొనసాగితే మరో 50 ఏళ్ల తరువాత పంటలు పండించేందుకు భూమి పనికిరాదన్నారు. ఈ నేపథ్యంలో సేంద్రియ పంటలు దిశగా దేశ రైతులు మరింతగా ముందడుగేయాల్సిన అవసరముందన్నారు. ఉరుకుల పరుగుల జీవితం కారణంగా విపరీతంగా విస్తరిస్తున్న ఫాస్ట్ ఫుడ్ కల్చర్‌కు ప్రజలు దూరంగా ఉండాలన్నారు. రోటి చెట్నీ, ఉలవచారు, గోంగూర, ఊరగాయ, అంబలి వంటి సేంద్రియ ఆరోగ్యకరమైన ఉత్పత్తులు కనుమరుగయ్యాయన్నారు. పాల ఉత్పత్తి కోసం పశువులకు ఇంజక్షన్లు ఇవ్వడంతో ఇటలీ, జర్మనీ, జపాన్ వంటి పాశ్చాత్య దేశాల్లో పురుషుల్లో వీర్యకణాల సంఖ్య తగ్గడంతో పాటు దంపతులకు పిల్లలు పుట్టడం లేదని అధ్యాయనాల్లో తేలిందన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దేశ ప్రజలు ఇప్పటికైనా మేల్కొని సేంద్రియ, సంప్రదాయ ఆహారంపై దృష్టిసారించాలన్నారు. భూమిపైన పుట్టిన ప్రతిజీవి శుభంగా ఉండాలని చెబుతున్న మన సనాతనధర్మాన్ని తప్పక పాటించాలన్నారు. ప్రజల్లో అవగాహన తెచ్చేందుకు కేంద్రం ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్ నినాదం అభినందనీయమన్నారు. అనంతరం ఆయన పలువురు రైతులను, సేంద్రియ వ్యవసాయ రంగానికి వివిధ రూపాల్లో కృషి చేసిన వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో భారత కిసాన్ సంఘ్ జాతీయ కార్యదర్శి జలగం కుమారస్వామి, సంఘం అధ్యక్షుడు పీఎల్ఎన్ రాజు, కార్యదర్శి యుగంధర్‌రెడ్డి, గ్రీన్ క్లైమేట్ టీమ్ కార్యదర్శి జేవీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

మురిపించిన.. ఆర్గానిక్ మేళా

ఎంవీపీకాలనీ: విశాఖ ఆర్గానిక్ మేళా–2023కు విశాఖవాసుల నుంచి విశేష స్పందన లభించింది. రైతులు పండించిన పంటలను, సేంద్రియ ఉత్పతులను వీక్షించేందుకు, కొనుగోళ్లు చేసేందుకు వచ్చిన వినియోగదారులతో చివరి రోజు సైతం మేళా కిటకిటలాడింది. మాకవరపాలెం మండలం జంగాలపల్లికి చెందిన నేచురల్ జాగిరీ సంస్థ ప్రదర్శించిన 18 రకాల బెల్లం ఉత్పత్తులు, అంజనేయ ఆయుర్వేద ఔషధ గుణాల ఉత్పత్తులు సందర్శకులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గ్రామీణ రైతన్న జీవనశైలిని ప్రతిబింబించేలా తీర్చిదిద్దిన ముఖద్వారం, స్వాగత రంగోళి, సేంద్రియ విధానంలో అభివృద్ధి చేసిన పెరటి మొక్కలు, చిరుధాన్యాలతో కూడిన ఆహార ఉత్పత్తులు, సహజసిద్ధ ఔషధాలు, పిండి వంటలు ఇలా ఎన్నో వినియోగదారులను ఆకట్టుకున్నాయి.

ఒకే వేదికపై అన్ని ఉత్పత్తులు



అన్ని రకాల ఆరోగ్యకరమైన ఉత్పత్తులు ఒకే వేదికపై లభించాయి. మట్టి పాత్రల స్టాల్‌తో పాటు సోప్స్, ఫుడ్ స్టాల్స్, పెయిన్ రిలీఫ్ ఆయిల్స్ స్టాల్స్ బాగున్నాయి. ఇలాంటి మేళాల ద్వారా రైతులు పండించిన పంటలు నేరుగా మార్కెట్ చేసుకొనే అవకాశం ఏర్పడుతుంది. సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతులకు ఇది పెద్ద ఊరట. అయితే తరచు ఇలాంటి మేళా నిర్వహిస్తే బావుంటుంది.

– ప్రీతి, చాందిని, ఎంవీపీ కాలనీ

కొనుగోళ్లతో ప్రోత్సాహం



ఆర్గానిక్ మేళా ద్వారా జరిగే కొనుగోళ్లతో రైతులు సేంద్రియ పంటలు పండించేందుకు ప్రోత్సాహం లభిస్తోంది. చాలా సూపర్ మార్కెట్లలో సేంద్రియ ఉత్పత్తులని చెప్పి విక్రయాలు జరుపుతున్నా వాటి నాణ్యతపై అనేక సందేహాలు ఉంటున్నాయి. ఈ మేళా ద్వారా అయితే నేరుగా రైతు నుంచే విక్రయాలు చేసేందుకు వీలుంది. తద్వారా రైతుకు ప్రోత్సాహంతో పాటు సేంద్రియ పంటలకు మరింత ప్రాధాన్యత లభిస్తుంది.

– విజయలక్ష్మి, కవిత, ఇసుకతోట

ఆరోగ్యానికి రక్షణ



సేంద్రియ, సుగంధ ద్రవ్యాలను పెద్ద ఎత్తున విక్రయించారు. చిరుధాన్యాలకు చెందిన అనేక మంచి ఉత్పత్తులను ఇక్కడ ప్రదర్శించడంతో పాటు తక్కువ ధరకే విక్రయిస్తున్నారు. వీటి వల్ల ఆరోగ్యానికి రక్షణ లభిస్తుంది. బయట లభించే రసాయనాలతో కూడిన ఉత్పత్తులను వాడటం కంటే ఇవి చాలా శ్రేయస్కరం. ఇలాంటి ఆర్గానిక్ మేళాలు తరచు నిర్వహించాలని కోరుతున్నాం.

– మంగ, సుజాత, గాజువాక